విద్యార్థులకు సాహస్ స్కాలర్‌షిప్ మంజూరు

ముషీరాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సాహస్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2024–25 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో 75 శాతం మార్కులకు పైబడి ఉన్న 15 మంది విద్యార్థులకు అడ్మిషన్, ఎగ్జామ్ ఫీజ్ కోసం రూ. 1,24,590ల ఉపకార వేతనం మంజూరైనట్లు కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ ఎం.రామచంద్రం తెలిపారు. విద్యార్థులకు ఈ ఉపకార వేతనం రావడానికి కృషి చేసిన సీతాఫల్‌మండి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, హిందీ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమలను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎంసీపీఐ (యూ)లో వర్కర్స్ పార్టీ విలీనం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎంసీపీఐ(యూ) పార్టీలో వర్కర్స్ పార్టీని విలీనం చేసినట్లు ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగాచారి పార్టీలో విలీనం చేసినట్లు తెలిపారు. కమ్యూనిస్టులంతా ఐక్యంగా ఉండి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, బి. తుకారం నాయక్, వడ్ల అరుణ, మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

నూతన కమిటీ ఎన్నిక


కొప్పు పద్మ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం మహిళా రాష్ట్ర కమిటీని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, ప్రధాన కార్యదర్శి బాలకిష్ణ తెలిపారు. రాష్ట్ర కన్వీనర్‌గా కొప్పు పద్మ, కో కన్వీనర్‌గా బక్కి బాలమణి, గాండ్ల అమరావతి, కాగు లక్ష్మీ, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కె. లలిత, చిలుకూరి సత్యవతి, కనకతారతోపాటు మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

ముషీరాబాద్: గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర డైరీని శనివారం సంస్థ కార్యాలయంలో సీఎండీ సయ్యద్ ఇమామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నర్సయ్య, చంద్రమోహన్, వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా దేవాలయం వద్ద శంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఇరుముడి కార్యక్రమంలో ముఠాగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ గురుస్వామి, జనార్దన స్వాముల ఆధ్వర్యంలో శబరిమలకు వెళ్తున్న అయ్యప్పస్వాములకు ఎమ్మెల్యే ముఠాగోపాల్ శుభాకాంక్షలు తెలియజేశారు.

సత్కారం

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ జన్మదిన వేడుకలను బషీర్‌బాగ్ ఫతేమైదాన్ క్లబ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్‌ను పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లేబర్‌బోర్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, నేతలు చందు పటేల్, సంతోష్ గుప్తా బాలకిషన్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

కాచిగూడ: బండలబస్తీలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్, వర్షపు నీటి పైపులైన్ నిర్మాణపు పనులను శనివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, బస్తీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


స్వేత

నల్లకుంట: వివాహిత అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు బాపట్లకు చెందిన నక్క రవి కుమార్, నక్క స్వేత (26)లు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. సుల్తాన్ బజార్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో పని చేస్తున్న భార్యాభర్తలిద్దరూ నల్లకుంట నర్సింహబస్తీలో నివాసముంటున్నారు. కొన్ని కారణాలతో రవికుమార్ ఇటీవల ఆ కళాశాలలో పని మానేసి రామంతాపూర్‌లో మరో పనిలో చేరాడు. ఈ విషయమై గతనెల 26వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన స్వేత ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారిని విచారించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకలను ప్రారంభిస్తున్న మాజీ చీఫ్ జస్టిస్ డాక్టర్ వై.భాస్కర్ రావు



విద్యార్థినులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న డాక్టర్ వై.భాస్కర్‌రావు



సంకల్పంతో చదివితేనే 'భవిత'కు భరోసా

కర్ణాటక హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ డాక్టర్ వై.భాస్కర్ రావు


డాక్టర్ వై.భాస్కర్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఐవీఎస్ హేమమాలిని తదితరులు


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కాచిగూడ: ప్రయత్నం లేకుండా ఏ వ్యక్తి విజయం సాధించలేరని, అనుకున్న లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకుని కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం పెద్ద కష్టమేమి కాదని కర్ణాటక హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ డాక్టర్ వై.భాస్కర్‌రావు అన్నారు. తెలంగాణ యువతి మండలి ఏ.శ్యామలదేవి జూనియర్ కాలేజీ వార్షికోత్సవ వేడుకలను శనివారం బర్కత్‌పురలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు, కాలేజ్ కరస్పాండెంట్ పద్మజ మల్లి కార్జున్ అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను సాధించాలనుకున్న లక్ష్యానికి అనుగుణంగా మలచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వృత్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. చిన్న చిన్న వాటికి నిరాశ చెందకుండా నిరంతరం పట్టుదల, ఏకాగ్రతతో చదవాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్ ఇంకా ఎందరో మేధావుల వెనుక ఎంతో కష్టం దాగి ఉంటుందని అందుకే శ్రమతోనే ఫలితం దక్కుతుందన్న నిజాన్ని ఎప్పుడు గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీలకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యువతి మండలి కార్యదర్శి నివేదిత కుమార్, ఉపాధ్యక్షురాలు వై.అరుణ భాస్కర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీపై ఆందోళన వద్దు

ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్



నల్లకుంట: మొన్నటి వరకు ప్రజలను కొవిడ్ వణికించగా, ఇప్పుడు హ్యూమన్ మెటా ఫ్యూమా వైరస్ (హెచ్‌ఎంపీవీ) ఆందోళన కలిగిస్తుందని, అయితే తెలంగాణలో హెచ్‌ఎంపీవీకి సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కాలేదని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. రాజేంద్ర ప్రసాద్ శనివారం 'సాక్షి'తో వెల్లడించారు. ఈ వైరస్ పట్ల నగర ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శీతాకాలంలో సాధారణంగా జలుబు, ఫ్లూ వంటి లక్షణాలు ఉంటాయని, చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఎన్‌సీడీసీ డైరెక్టర్లు, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో సమన్వయం కలిగి పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని వివరించారు. ఇది శ్వాసకోశ సంబంధిత వ్యాధి అని, ఏదీ ఏమైనప్పటికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఒక వేళ హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైనా చికిత్సలు అందించేందుకు తమ వైద్య బృందం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈ శ్వాస కోశ ఇన్‌ఫెక్షన్లను నివారించేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రతిభను గుర్తించి గౌరవించడమే నిజమైన సత్కారం

చిక్కడపల్లి: ప్రతిభను గుర్తించి గౌరవించడమే మనిషికి నిజమైన సత్కారమని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ శేషయనారెడ్డి అన్నారు. శనివారం రాత్రి చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో సాంస్కృతిక సంస్థ ఆరాధన ఆధ్వర్యంలో టీవీ న్యూస్ ప్రజెంటర్స్‌కు జరిగిన జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషయనారెడ్డి న్యూస్ ప్రజెంటర్స్ సతీష్ (10టీవీ), స్పందన (జీ తెలుగు), సౌజన్య(ఎన్‌టీవీ) శివశంకర్ (దూరదర్శన్ యాదగిరి)లకు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. రిటైర్డు న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, ప్రముఖులు జి.హనుమంతారావు, చిల్లా రాజశేఖర్‌రెడ్డి, ఉమర్‌ఖాన్, యుగంధర్‌రెడ్డి, నిర్మలాప్రభాకర్, వడ్లకొండ వెంకట్రావు, ప్రతాప్‌కుమార్, రాఘవరెడ్డి, వాఖ్యాత మోహనకృష్ణ, టీవీ న్యూస్ రీడర్స్ రాణి, పూర్ణిమ, అనుశ్రీ (సాక్షి) తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో శనివారం బొబ్బాల శ్రీనివాసులు అధ్యక్షతన బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతి ఒక్కరికి స్కాలర్‌షిప్, హాస్టల్స్ మంజూరు, గురుకులాల ఏర్పాటు, బీసీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు వంటి స్కీమ్స్‌ను అమలు చేయాలని అన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చినప్పుడే బీసీ బిల్లు సాకారమవుతుందని, అందువల్ల అన్ని రాకీయ పార్టీలు బీసీ బిల్లుకు పూర్తి మద్దుతును ప్రకటించాలని కోరారు. బీసీ హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య, నిఖిల్, రవి, నరేష్, ఆశీష్, బాలయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఎండీకి కార్పొరేటర్ వినతి


వినతిపత్రం అందజేస్తున్న కె.రవిచారి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా బాగ్‌లింగంపల్లిలోని ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, సాయిబాబా టెంపుల్ వద్ద, శ్రీరామ్‌నగర్ కమాన్ బస్తీలో సీవరేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. అలాగే ఆజామాబాద్ సెక్షన్ పరిధిలోని రిసాలగడ్డలో పాత డ్రైనేజీ పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జలమండలి ఎండీకి రాసిన లేఖను కూడా సమర్పించారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి

పలువురి సంతాపం


సీనియర్ జర్నలిస్టు భీమ్‌రావుయాదవ్


భీమ్‌రావు భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

ముషీరాబాద్: సీనియర్ జర్నలిస్టు ఎన్.సి.భీమ్‌రావుయాదవ్ (62) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గ కేంద్రంగా వివిధ దినపత్రికల్లో మూడు దశాబ్దాలపాటు విలేకరిగా పని చేస్తూ స్థానిక ప్రజా సమస్యలపై వార్తలు, కథనాలు రాసి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్రీనివాస్,సి.హెచ్.వీరారెడ్డి, కనకరాజు, సాగర్, రాంరెడ్డి, నాగరాజు, శివకుమార్, తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్య తదితరులు భీమ్‌రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

దత్తాత్రేయ సంతాపం.

సీనియర్ జర్నలిస్టు ఎన్.సి.భీమ్‌రావు యాదవ్ మృతి పట్ల హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేద బ్రాహ్మణ కుటుంబానికి ఆపన్న హస్తం అందించండి


నల్లకుంట: అనారోగ్యంతో ఎల్‌బీనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేరి చికిత్సలు పొందుతూ మూడు రోజుల క్రితం మృతి చెందిన నిరుపేద బ్రాహ్మణుడు కొవ్వూరి కిషన్ రావు (70) కుటుంబానికి ఆపన్న హస్తం అందించి ఆదుకునేందుకు మానవతావాదులు ముందుకు రావాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు నేడొక ప్రకటనలో కోరారు. మీర్‌పేటలో ఓ అద్దె ఇంట్లో నివాసముండే అతనికి భార్య ప్రమీళ, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. వారిలో ఒక కుమారుడు మానసిక వికలాంగుడని చెప్పారు. దహన సంస్కారాల నిమిత్తం బ్రాహ్మణ సేవా సమితి నుంచి తమకు తోచిన సహాయం అందించామని ఆయన తెలిపారు. కాగా దశదిన కర్మ వరకు మరో వారం రోజుల పాటు నిర్వహించాల్సిన కార్యక్రమాలకు ఆ పేద కుటుంబం వద్ద చిల్లగవ్వ కూడా లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పూట కూడా గడవడం కష్టంగా ఉన్న ఆ నిరుపేద కుటుంబాన్ని చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. మృతుడి భార్య ఫోన్ పే: 93467 06613 నంబర్‌కు ఆర్థిక సహాయం పంపించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం


శిక్షణ కార్యక్రమంలో డీఎంసీ మారూతీ దివాకర్

అంబర్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే పకడ్బందీగా ఉండాలని సర్కిల్–16 డీఎంసీ మారూతీ దివాకర్ తెలిపారు. లబ్ధిదారుల సర్వే నిర్వహణపై సిబ్బందికి శనివారం ఛేనంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందని అందులో అర్హత వివరాలను సర్వే చేసి పొందుపర్చాలన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో 44 వేల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారి ఇంటి వద్దకే వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ రవీందర్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి


శాంతినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

అంబర్‌పేట: డివిజన్‌లో మెజార్టీ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం డివిజన్‌లోని బతుకమ్మ కుంట, శాంతినగర్, వైభవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. తరుచూ తలెత్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆమె వెంట జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు, మేనేజర్ మాజీద్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలం

ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్


బ్యాగులను అందజేస్తున్న డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు

కవాడిగూడ: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. శనివారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోషల్ వర్కర్ సురేష్, నవీన దంపతుల ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను డాక్టర్ కె.లక్ష్మణ్ స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న నాటి నుంచి కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో మౌలి క సదుపాయాల కల్పనకు కృషి చేశానని భవిష్యత్‌లో కూడా పాఠశాల అభివృద్ధికి సహకారం అందించేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకొని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యాబోధన అందించి మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని ఆయన సూచించారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎం. రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, పరిమళ్‌కుమార్, రంగరాజ్ గౌడ్, పూసరాజు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, రమేష్ గౌడ్, రాగం రవికుమార్, సలంద్రి దిలీప్ యాదవ్, అనిల్ కుమార్, హైస్కూల్ ప్రిన్సిపాల్ మీనాకుమారి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థులు హాజరయ్యారు.

రాజ్‌కుమార్ డేవిడ్ నివాసానికి ఎమ్మెల్సీ కవిత


రాజ్‌కుమార్ డేవిడ్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీ కవిత

ముషీరాబాద్: క్రిస్మస్, నూతన సంవత్సరంతోపాటు ఇటీవల తమ ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరుకావాలని ఎమ్మెల్సీ కవితను బీఆర్‌ఎస్ నాయకులు రాజ్‌కుమార్ డేవిడ్ ఆహ్వానించినప్పటికీ బిజీ షెడ్యూల్ వల్ల రాలేకపోయానని అందుకే శనివారం డేవిడ్ నివాసానికి వచ్చినట్లు బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఈ సందర్భంగా డేవిడ్ కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ముషీరాబాద్ నియోకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి కోసం డేవిడ్ రాజ్ కృషి చేస్తున్నారని అభినందించారు. కవిత తమ ఇంటికి రావడం పట్ల డేవిడ్ కుటుంబం ఆనందం వ్యక్తం చేశారు.

వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తాం


మాట్లాడుతున్న వేముల వెంకటేష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేష్ అన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేముల వెంకటేష్ మాట్లాడుతూ ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆయన కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వడ్డెరులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 11న వడ్డె ఓబన్న జయంతిని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలి మల్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిట్ల మల్లేష్, ఎత్తరి గణేష్, శివరాత్రి బిక్షం, పల్లపు దుర్గయ్య, గుర్రం శ్రీనివాస్, శంకర్, చెన్నయ్య, కొడదల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు

కాచిగూడ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ అనీష్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సీవరేజీ పైపులైన్ పనులను త్వరితంగా పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి : సీవరేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో చేపడుతున్న సీవరేజీ పైపులైన్ నిర్మాణ పనులను శనివారం వాటర్‌వార్క్స్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గాంధీనగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, జలమండలి మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌స్పెక్టర్ మహేష్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు హక్కులు కల్పించాలి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

చిక్కడపల్లి : భూ యజమానులతో పాటు కౌలుదారులు, సాగుదారులు సాగు హక్కు కల్పించి పంటరుణాలు, ప్రభుత్వ పథకాలను అందజేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో చైతన్య సేద్యం మాసపత్రిక 2025 కేలండర్‌ను జూలకంటి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా ఆవిష్కరించి మాట్లాడారు. రైతు భరోసాకు రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలనడం సరైందికాదన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్ రావు, టి.సాగర్‌లు మాట్లాడుతూ అసైన్డ్ భూముల సమస్యలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఫసల్ బీమాతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సారంపల్లి మల్లారెడ్డి, జంగారెడ్డి, రమేష్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి,, మూడ్ శోభన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఎందుకు మార్చాలి?



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాజ్య పాలకులు సక్రమంగా లేకుంటే రాజ్యాంగం సక్రమంగా అమలు కాదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. అసలు రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేయడానికే ఈ లాంటి ప్రయత్నాలు జరుగుతాయని విమర్శించారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం లౌకికవాదం ప్రస్తుత పరిస్థితులు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ లౌకికవాదం, సామ్యవాదం అనేవి రాజ్యాంగంలో మొదటి నుంచి చివరి వరకు ఉన్నాయన్నారు. దేశ ప్రగతి కోసం సమానత్వాన్ని సాధించడానికే ఈ రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ లౌకిక జీవితం మత విశ్వాసాలను ప్రభావితం చేస్తుందని, దేశంలో 90శాతం లౌకికవాదులు ఉన్నారన్నారు. ఒక మతాన్ని విశ్వసించే వారు మరొక మతాన్ని ద్వేషించమని ఎక్కడ చెప్పలేదని అన్నారు. లౌకిక ధర్మాన్ని రక్షించుకోకపోతే మనకు రక్షణ ఉండదని చెప్పారు.